క్లుప్తంగా

వాటర్ ప్లాంటు ప్రారంభం



వాటర్ ప్లాంటును ప్రారంభిస్తున్న దృశ్యం

కుందుర్పి/గుమ్మఘట్ట: కుందుర్పిలోని జ్యోతి రావ్ పూలే బాలుర గురుకుల పాఠశాలలో శనివారం సీసీఎల్ ప్రొడక్ట్స్ కంపెనీ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబులిటీ(సీఎస్ఆర్) కింద రూ.1.70 లక్షలతో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంటును సాహితి గగన్ మహల్ అధ్యక్షుడు, న్యాయవాది ప్రతాప్‌రెడ్డి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ సంస్థ జిల్లాలోని పలు విద్యాసంస్థల్లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు. అలాగే గుమ్మఘట్ట మండలకేంద్రంలోని ఎంజేపీ గురుకుల పాఠశాలకు సీసీఎల్ ప్రొడక్ట్ లిమిటెడ్ హైదరాబాదు వారు 1000 లీటర్ల సామర్థ్యంగల ఆర్వో ప్లాంట్‌ను వితరణ చేసి ప్రారంభించారు. న్యాయవాది జె.ప్రతాప్‌రెడ్డి ప్రిన్సిపాల్ శ్రీదేవి, ఉపాధ్యాయుల బృందం పాల్గొన్నారు.

సేంద్రియ సాగు లాభదాయకం



మాట్లాడుతున్న సీఈఓ మురళీకృష్ణ

కుందుర్పి: సేంద్రియ వ్యవసాయ పద్ధతులతో పంటల సాగు లాభదాయకంగా ఉంటుందని మండల రైతు ఉత్పత్తిదారుల పరస్పర సహాయ సహకార సంఘం సీఈఓ మురళీకృష్ణ పేర్కొన్నారు. శనివారం శనివారం బండమీద పల్లిలో సంఘం తొమ్మిదో మహాసభ ఆర్‌డీటీ సంస్థ పర్యవేక్షణలో నిర్వహించారు. రైతులు వ్యవసాయంతో పాటు వ్యాపారాలు చేసుకొంటూనే ఉమ్మడిగా పంటలు పండించి సొంత గ్రామాల్లోనే పండించిన పంటలను విక్రయించాలని సీఈఓ సూచించారు. కార్యక్రమంలో ఏపీ మాస్ కోఆర్డినేటర్ గోపాల్‌రాజు, మండల టీం లీడర్ వెంకటేశులు సిబ్బంది పాల్గొన్నారు.

మోపిడిలో నాకాబందీ



గ్రామస్తులకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ మహానంది

ఉరవకొండ రూరల్: మండలం పరిధిలోని మోపిడి గ్రామంలో శనివారం ఉరవకొండ అర్బన్ సీఐ మహానంది, ఎస్‌ఐ జనార్దన్ నాయుడు ఆధ్వర్యంలో పోలీసులు నాకాబందీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గ్రామంలో అనుమానస్పద స్థావరాలను తనిఖీ చేశామన్నారు. అసాంఘిక కార్యక్రమాలపై ఉక్కుపాదం మోపుతామన్నారు. తప్పు చేస్తే ఎంతవారైనా ఉపేక్షించేది లేదని.. చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పట్టపగలే చోరీ

కళ్యాణదుర్గం రూరల్: పట్టణంలోని పార్వతి నగర్‌లో శనివారం పట్టపగలే చోరీ జరిగింది. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాలు.. బెళుగుప్ప మండలం గంగవరం గ్రామానికి చెందిన రాజేంద్ర, త్రివేణి దంపతులు పార్వతీ నగర్‌లో నివాసం ఉంటున్నారు. ఎర్రంపల్లి ప్రభుత్వ పాఠశాలలో రాజేంద్ర, శెట్టూరు ప్రభుత్వ పాఠశాలలో త్రివేణి చేస్తున్నారు. ఉదయం ఇద్దరూ విధులకు వెళ్లారు. ఇదే అదనుగా భావించిన గుర్తు తెలియని వ్యక్తులు తాళం ధ్వంసం చేసి ఇంట్లోకి చొరబడి బీరువా తెరిచి అందులో ఉన్న 22 తులాల బంగారు ఆభరణాలు, 10 తులాల వెండి, రూ.20 వేలు నగదును ఎత్తుకెళ్లారు. ఎస్‌ఐ యువరాజు సిబ్బందితో కలిసి ఘటనస్థలాన్ని పరిశీలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

శ్రీధరఘట్ట చెరువు తూము ఏర్పాటుకు చర్యలు



తూము ఏర్పాటుకు ఎగువ కాలువను పరిశీలిస్తున్న అధికారులు

బొమ్మనహాళ్: మండలంలోని శ్రీధరఘట్ట చెరువుకు తుంగభద్ర ఎగువ కాలువ నుంచి తూమును ఏర్పాటు చేసి నీటి ఇచ్చేందుకు ఇరిగేషన్ డీఈఈ బలరామ్, హెచ్చెల్సీ డీఈఈ దివాకర్‌రెడ్డి శనివారం పరిశీలించారు. 136–862 కిలోమీటర్ వద్ద తూమును ఏర్పాటు చేసి చెరువుకు నీరు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వారు తెలిపారు. ప్రధాన కాలువ పక్కన కొందరు భూములు సాగు చేయడంతో సర్వే చేయించాలని హెచ్చెల్సీ భూమి ఎక్కడ వరకు ఉందో చూసి తూము నిర్మించి, కాలవ తీసుకునేందుకు అనుకూలంగా ఉంటుందన్నారు. చెరువుకు ఎక్కడ నుంచి నీళ్లు ఇస్తే బాగుంటుందని ఎగువ కాలవను పరిశీలిస్తున్నామన్నారు. నివేదిక తయారు చేసి ప్రభుత్వానికి పంపిస్తామన్నారు. కార్యక్రమంలో తుంగభద్ర ప్రాజెక్ట్ వైస్ చైర్మన్ కేశవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కుంటుపడిన బోధన

- మున్సిపల్ స్కూళ్లలో వేధిస్తున్న ఉపాధ్యాయుల కొరత
- 134 శాంక్షన్ పోస్టులకు 51 మంది మాత్రమే పనిచేస్తున్న దుస్థితి
- 12 మున్సిపల్ స్కూళ్లలో సింగిల్ టీచర్ బోధన



ఎస్ఎస్ బస్తీ మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో పాఠాలు బోధిస్తున్న ఏకోపాధ్యాయుడు

రాయదుర్గంటౌన్: ఉపాధ్యాయుల కొరతతో బోధన కుంటుపడింది. రాయదుర్గంలోని మున్సిపల్ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా వేధిస్తోంది. దీంతో విద్యార్థుల చదువులపై నీలినీడలు కమ్ముకున్నాయి. మున్సిపల్ పాఠశాలల్లో ఆశించిన మేర అడ్మిషన్లు జరిగినా అందుకు తగ్గట్టుగా ఉపాధ్యాయ పోస్టులు భర్తీ జరగలేదు. పట్టణంలో మొత్తం 35 మున్సిపల్ పాఠశాలలు ఉండగా 4,608 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ఇటీవల జరిగిన బదిలీల్లో రాయదుర్గం పట్టణంలోని వివిధ పాఠశాలల నుంచి దాదాపు 22 మంది ఇతర ప్రాంతాలకు బదిలీ కాగా ఇక్కడికి ఏ ఒక్కరు కూడా రాకపోవడంతో ఉపాధ్యాయుల కొరత తారాస్థాయికి చేరింది. 35 మున్సిపల్ పాఠశాలల్లో మొత్తం 134 మంది ఉపాధ్యాయ మంజూరు పోస్టులకు గాను ప్రస్తుతం కేవలం 51 మంది మాత్రమే పనిచేస్తున్నారంటే పరిస్థితి ఎంత ఘోరంగా ఉందో తెలుస్తోంది. అంటే దాదాపు 83 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. బదిలీల్లో ఇతర ప్రాంతాల నుంచి రాయదుర్గం పట్టణానికి వచ్చేందుకు విముఖత చూపుతున్నారు. దాదాపు 12 స్కూళ్లలో కేవలం సింగల్ టీచర్ బోధన కొనసాగుతుదంటే ఉపాధ్యాయుల కొరత ఏస్థాయిలో ఉందో అర్థమవుతోంది.

హైస్కూళ్లలో వెంటాడుతున్న ఉపాధ్యాయుల కొరత

మున్సిపల్ హైస్కూళ్లలో ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా ఉంది. మున్సిపల్ అభ్యుదయ హైస్కూల్‌లో 15 మందికి గాను నలుగురు, ఇందిరాగాంధీ మున్సిపల్ హైస్కూల్‌లో 8 మందికి గాను ముగ్గురు, బాలగంగాధర్ తిలక్ మున్సిపల్ హైస్కూల్‌లో 20 మందికి 11, డాక్టర్ రాధాకృష్ణ మున్సిపల్ హైస్కూల్‌లో 17 మందికి 11 మంది ఉపాధ్యాయులు పనిచేస్తుండగా, రాజీవ్‌గాంధీ ఉర్దూ మున్సిపల్ హైస్కూల్‌లో 17 మందికి ముగ్గురు రెగ్యులర్ ఉపాధ్యాయులు పనిచేస్తుండగా నలుగురు డెప్యుటేషన్‌పై పనిచేస్తున్నారు. ఇటీవల అప్‌గ్రేడ్ అయిన అంజుమన్ అజ్మతుల్ ఇస్లాం ఉర్దూ హైస్కూల్‌లో 7 పోస్టులకు కేవలం సింగల్ టీచర్ బోధన జరుగుతోంది. సబ్జెక్టుల వారిగా ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా ఉండడంతో చదువులపై తీవ్ర ప్రభావం చూపనుంది. ముఖ్యంగా పదో తరగతి విద్యార్థులపై అధిక ప్రభావం చూపే అవకాశం ఉంది.

12 స్కూళ్లలో కేవలం సింగిల్ టీచర్ బోధన

పట్టణంలోని 11 ప్రైమరీ మున్సిపల్ స్కూళ్లు, ఒక మున్సిపల్ హైస్కూల్‌లో ఏకోపాధ్యాయుడే గతి. సింగల్ టీచర్ బోధనతో విద్యార్థులకు ఏమేరకు నాణ్యమైన విద్య అందుతుందనే విషయం ప్రశ్నార్థకం. పట్టణంలోని ఆర్డీ బస్తీ ప్రాథమిక పాఠశాల, ఎస్ఎస్ బస్తీ ప్రాథమిక పాఠశాల, సుభాష్ చంద్ర బోస్ మున్సిపల్ ప్రాథమిక పాఠశాల, శ్రీవెంకటేశ్వర ప్రాథమిక పాఠశాల, శ్రీచౌడేశ్వరీదేవి ప్రాథమిక పాఠశాల, 3,4 వార్డుల ప్రాథమిక పాఠశాల, జాకీర్ హుస్సేన్ ప్రాథమిక ఉర్దూ పాఠశాల, హిమ్మత్‌నగర్ ప్రాథమిక ఉర్దూ పాఠశాల, శాంతినగర్ ఉర్దూ ప్రాథమిక పాఠశాల, నెహ్రూ ఉర్దూ ప్రాథమిక పాఠశాల, మొహమ్మద్ అలీ జోహర్ ఉర్దూ పాఠశాల, ఇటీవల అప్‌గ్రేడ్ అయిన 110 మంది విద్యార్థుల సంఖ్యలో అంజుమన్ అజ్మతుల్ ఇస్లాం ఉర్దూ హైస్కూల్‌లో కేవలం సింగల్ టీచర్‌తో నెట్టుకొస్తున్నారు. ఒకవేళ డీఎస్సీలో పోస్టుల భర్తీ చేసే అవకాశం ఉన్నా కేవలం పది పోస్టులు మాత్రమే పురపాలక సంఘానికి కేటాయించినట్లు ఉపాధ్యాయ వర్గాల ద్వారా తెలుస్తోంది.

ఉపాధ్యాయుల కొరత తీర్చాలి



మా వార్డు పరిధిలోని అంజుమన్ అజ్మతుల్ ఇస్లాం ఉర్దూ హైస్కూల్‌లో దాదాపు 110 మంది విద్యార్థులు చదువుతున్నారు. కేవలం ఒక ఉపాధ్యాయుడితో బోధన జరుగుతోంది. హైస్కూల్ సెక్షన్ కేవలం ఒకే ఉపాధ్యాయుడితో చదువులు ఎలా సాధ్యపడుతాయి. మా ఇద్దరు పిల్లలు ఇదే పాఠశాలలో చదువుతున్నారు. ప్రభుత్వం స్పందించి పాఠశాలలో ఉపాధ్యాయుల సంఖ్య పెంచి నాణ్యమైన విద్య అందజేయాలి.
– హుస్సేన్, సబీనాబాను, తల్లిదండ్రులు, 27వ వార్డు

ఉన్నతాధికారులకు నివేదించాం



పురపాలక సంఘం పాఠశాలల్లో ఖాళీ ఉన్న పోస్టుల వివరాలను ఉన్నతాధికారుల దృష్టికి నివేదించాం. త్వరలో డీఎస్సీలో పోస్టులు భర్తీ జరిగితే కొంత మేర ఉపాధ్యాయుల కొరత తీరే అవకాశం ఉంది. మరోవైపు వర్క్ అడ్జెస్ట్‌మెంట్ కింద ఉపాధ్యాయుల పోస్టులు భర్తీ చేసేందుకు ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించి సమస్య పరిష్కరించేందుకు కృషి చేస్తాం. – నాగమణి, ఎంఈఓ, రాయదుర్గం

అటకెక్కిన వీధి దీపాల నిర్వహణ



పగలంతా వెలుగుతూనే ఉన్న స్ట్రీట్ లైట్

రాయదుర్గంటౌన్: మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల సమ్మె ఫలితంగా పట్టణంలో వీధి దీపాల నిర్వహణ అటకెక్కింది. శనివారం సమ్మె ఏడో రోజుకు చేరుకుంది. న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని, సమస్యలు పరిష్కరించే దాకా పోరాటం కొనసాగుతుందని కార్మికులు నిరవధిక సమ్మె చేస్తున్నారు. ఇంజినీరింగ్ కార్మికులకు సంబంధించి వీధిదీపాలు, తాగునీటి నిర్వహణ ముఖ్యమైనవి. ఇందులో ప్రధానంగా.వీధిదీపాల నిర్వహణ అటకెక్కింది. ఆన్ చేసిన లైట్లను ఆర్పేవారు కరువయ్యారు. రోజంతా లైట్లు వెలుగుతూనే ఉన్నాయి. అధికారులు స్పందించి లైట్ల నిర్వహణను సక్రమంగా చేపట్టి విద్యుత్ బిల్లులు అధికంగా రాకుండా చూసుకోవాలన్నారు. రోజంతా లైట్లు వెలుగుతున్న కారణంగా కొన్ని మరమ్మతుకు నోచుకునే అవకాశం ఉంది.

ఆలయ ఆదాయ వనరులపై విచారణ



విచారణ చేస్తున్న దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ తిరుమలరెడ్డి

కణేకల్లు: పట్టణంలోని చిక్కణ్ణేశ్వరస్వామి ఆలయ ఆదాయ వనరులపై అనంతపురం దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ తిరుమలరెడ్డి శనివారం విచారణ నిర్వహించారు. ఆలయానికి భారీ ఆదాయం వస్తున్నా... అభివృద్ధి గురించి పట్టించుకోవడం లేదని నిధులు దుర్వినియోగమవుతున్నాయని ఇటీవల కలెక్టర్‌కు ఫిర్యాదు వెళ్లింది. కలెక్టర్ ఆదేశాల మేరకు అసిస్టెంట్ కమిషనర్, దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ వన్నూరుస్వామి, ఆ శాఖ జూనియర్ అసిస్టెంట్ జితేంద్రప్రసాద్, కళ్యాణదుర్గం, రాయదుర్గం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్లు విజయకుమార్, నరసింహారెడ్డి, పంపనూరు దేవాలయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ బాబు, కణేకల్లు దేవదాయశాఖ అధికారి దేవదాసు కణేకల్లుకు వచ్చి ఆలయం ఆదాయాలపై ఆరా తీశారు. రికార్డులను పరిశీలించారు. స్థానికులను సైతం అడిగి ఏ మేరకు ఆదాయం వస్తోందో? అడిగి తెలుసుకున్నారు. విచారణ నివేదికను కలెక్టర్‌కు సమర్పించనున్నట్లు దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ విలేకరులకు తెలిపారు.

నృసింహుడికి పల్లకీ సేవ



స్వామిని పల్లకీలో ఊరేగిస్తున్న భక్తులు

ఉరవకొండ రూరల్: పెన్నహోబిలం లక్ష్మీ నృసింహ స్వామికి శనివారం భక్తిశ్రద్ధలతో పల్లకీ సేవ నిర్వహించారు. తొలుత స్వామి మూలవిరాట్‌కు ప్రత్యేక అభిషేకం, అర్చనలు, పూజలు చేపట్టారు. అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత నృసింహస్వామి ఉత్సవమూర్తులను అలంకరించిన పల్లకీలో కొలువుదీర్చి ఆలయం చుట్టూ ఊరేగించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

వేంకటేశ్వరస్వామికి పూజలు



పూజలు నిర్వహిస్తున్న మహిళలు

కళ్యాణదుర్గం రూరల్: మున్సిపల్ కార్యాలయం ఎదుట ఉన్న వెంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం మహిళలు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఏడు శనివారాల వ్రతంలో భాగంగా ఉదయం అర్చకులు స్వామికి అభిషేకాలు, అర్చనల అనంతరం ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేపట్టారు. పెద్దసంఖ్యలో మహిళలు ఆలయ ఆవరణలో దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

ఆర్డీటీ ఎఫ్‌సీఆర్‌ఏ లైసెన్స్ పునరుద్ధరించాలి



కూడేరులో ఆర్డీటీని కాపాడాలంటూ నినాదాలు చేస్తున్న విద్యార్థులు



శెట్టూరులో మానవహారంగా ఏర్పడిన విద్యార్థినులు

శెట్టూరు: ఆర్డీటీ ఎఫ్‌సీఆర్‌ఏ లైసెన్స్‌ను పునరుద్ధరించాలని కేజీబీవీ విద్యార్థినులు డిమాండ్ చేశారు. ఈమేరకు శనివారం వారు కేంద్ర హోంమంత్రి అమిత్‌షాకు పోస్టుకార్డులు పంపారు. అంతకుముందు వారు పాఠశాల నుంచి పోస్టాఫీస్ వరకూ ర్యాలీ చేపట్టారు. మానవహారంగా ఏర్పడి ఆర్డీటీ ఎఫ్‌సీఆర్‌ఏను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఎమ్మెఎస్ రాయుడు, వైస్ ఎంపీపీ చెవుల కిష్టప్ప, దళిత నాయకులు గౌరయ్య, బాబురావు, లింగప్ప, తిప్పేస్వామి, మహేష్, సీబీటీ వన్నూర్‌స్వామి, విద్యార్థులు పాల్గొన్నారు.

సేవ్ ఆర్డీటీ పోస్టుకార్డు ఉద్యమం

కూడేరు: ఆర్డీటీ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 'సేవ్ ఆర్డీటీ' పేరిట మండలంలోని నిర్వహిస్తున్న పోస్టుకార్డు ఉద్యమం ఊపందుకుంది. శనివారం కూడేరులోని ప్రాథమిక పాఠశాల, శ్రీవాణి, సంగమేశ్వర పాఠశాలల్లో 300 మంది విద్యార్థులు ఆర్డీటీని కాపాడండి–పేదలకు సేవలందేలా చూడదండంటూ కేంద్ర హోంమంత్రి అమిత్‌షాకి పోస్టు కార్డులు రాసి పంపించారు. కార్యక్రమంలో పరిరక్షణ సమితి సభ్యులు అక్కమ్మ, పద్మ, లలిత, కళ్యాణి, సంజీవ రాయుడు,,రమణ, సుబ్బరాయుడు, ముత్యాలు పాల్గొన్నారు.

తూతూ మంత్రంగా మండల మీట్



మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీనివాసులు

కుందుర్పి: మండల పరిషత్ కార్యాలయంలో శనివారం మండల సర్వసభ్య తూతూమంత్రంగా ముగిసింది. ఎంపీపీ కమలమ్మ అధ్యక్షత జరిగిన సమావేశానికి ఎంపీడీఓ శంకర్, తహసీల్దార్ శ్రీనివాసులు తదితరులు హాజరయ్యారు. విద్యుత్, పోలీస్, ఆర్‌డబ్ల్యూఎస్ తదితర శాఖల అధికారులు గైర్హాజరయ్యారు. మండల పరిషత్ అధికారులు సమావేశానికి సంబంధించి ఎలాంటి సమాచారం ఇవ్వడం లేదని సర్పంచులు, ఎంపీటీసీలు సభ దృష్టికి తీసుకొచ్చారు. నాలుగు నెలలుగా ఉపాధి హామీ బిల్లులు అందకపోతే కూలీలు ఎలా జీవించాలని సభ్యులు ఈరన్న, గంగమ్మ తదితరులు అధికారులను ప్రశ్నించారు. అయితే వారికి సమాచారం చెప్పే వారే కరువయ్యారు. ఎంపీడీఓ అరగంట మాత్రమే సమావేశంలో ఉండి బయటకు వెళ్లారు. ఖరీఫ్ పంటలకు చీడపీడలు సోకి పంటలు నష్టపోతున్నా వ్యవసాయ అధికారులు పొలాలకు వెళ్లడం లేదని కనీసం వారానికి ఒక సారి మండలానికి రావడం లేదని సర్పంచులు గంగాధర, ప్రభాకర్ తదితరులు పేర్కొన్నారు. కార్యక్రమంలో పలువురు ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.

జాబితా పునఃపరిశీలన

గుమ్మఘట్ట: మండల వ్యాప్తంగా 15 గ్రామ సచివాలయాల పరిధిలో బంగారు కుటుంబాల గృహ జాబితా పునఃపరిశీలన చేయనున్నట్లు ఎంపీడీఓ రామకృష్ణ శనివారం తెలిపారు.ఈ నెల 22 నుంచి 29 వ తేదీ వరకూ గ్రామసభలు నిర్వహించి తుది జాబితాను రూపొందిస్తామన్నారు. మండలవ్యాప్తంగా 7,472 కుటుంబాలను గుర్తించామన్నారు. గ్రామ సభల్లో అర్హులను గుర్తించి జాబితాలో చేర్పిస్తామని, అనర్హులను తొలగిస్తామన్నారు.

అంజన్నకు అభిషేకం

బొమ్మనహాళ్: నేమకల్లు అంజన్నకు శనివారం అభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారి మూలవిరాట్‌ను పట్టువస్త్రాలతో, పుష్పలతో శోభాయమానంగా అలకరించారు. ప్రధాన అర్చకుడు అనిల్‌కుమార్‌స్వామి ఆధ్వర్యంలో పురోహితులు వేకువజాము నుంచే స్వామివారికి కుంకుమార్చన, పంచామృతాభిషేకం, ఆకుపూజ, విశేష వెండి తమలపాకు అలంకరణ, అర్చనలు, అభిషేకాలు చేశారు. వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

కర్ణాటక మద్యం పట్టివేత



పట్టుబడిన ద్విచక్రవాహాలు, పేకాటరాయుళ్లను చూపుతున్న పోలీసులు

కళ్యాణదుర్గం రూరల్: దొడగట్ట గ్రామంలో ఎక్సైజ్ పోలీసులు శనివారం కర్ణాటక మద్యం పట్టుకున్నారు. ఈసందర్భంగా గ్రామంలో బోయ లక్ష్మన్న, నాగేంద్ర అనే వ్యక్తులను పోలీసులు అరెస్ట్ చేసి వారి నుంచి 50 టెట్రా ప్యాకెట్లు, 10 డీపీఎల్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ సోమశేఖర్, ఎస్‌ఐ హరికృష్ణ తెలిపారు.

నాటుసారా విక్రేతల అరెస్ట్

వజ్రకరూరు: మండల పరిధిలోని వెంకటాంపల్లి పెద్దతాండా శివారులో శనివారం నాటుసారా విక్రయిస్తున్న వెంకటేష్ నాయక్, తులసమ్మను పోలీసులు అరెస్ట్ చేశారు. వీరి నుంచి 10 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

కళ్యాణదుర్గం రూరల్: పట్టణంలోని ఐదుకల్లు రోడ్డు వద్ద పేకాట శిబిరంపై పట్టణ పోలీసులు శనివారం దాడులు నిర్వహించారు. ఈసందర్భంగా నలుగురు పేకాటరాయుళ్లను అరెస్ట్ చేసి రూ.60,400 నగదు, 11 ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ యువరాజు తెలిపారు.

ప్లాస్టిక్ కాలుష్యాన్ని నివారిద్దాం



ఉరవకొండలో ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన ర్యాలీ



ఉంతకల్లులో క్యారీ బ్యాగ్‌లను పంపిణీ చేస్తున్న అధికారులు



కళ్యాణదుర్గంలో ర్యాలీ నిర్వహిస్తున్న డిగ్రీ కళాశాల విద్యార్థులు

కళ్యాణదుర్గం రూరల్: ప్లాస్టిక్ కాలుష్యాన్ని నివారిద్దామని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ హర్షలత విద్యార్థులకు సూచించారు. శనివారం పట్టణంలోని డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా కళాశాల ఆవరణలో ప్లాస్టిక్ వస్తువులనైన వాటర్ బాటిల్స్, కవర్స్, పేపర్స్ వంటివి సేకరించారు. ప్లాస్టిక్‌తో పర్యావరణానికి కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ వాడమని విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేశారు. కళాశాల ఆవరణలో విద్యార్థులు మొక్కలు నాటారు. వైస్ ప్రిన్సిపాల్ శేషయ్య, ఎన్ఎస్ఎస్ అధికారులు శ్రీధర్, రవిశంకర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

శెట్టూరు: మండల కేంద్రంలో శనివారం స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్రలో భాగంగా అధికారులు విద్యార్థులతో కలిసి ఉన్నతపాఠశాల నుంచి ర్యాలీ నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహం వద్ద మానవహారంగా ఏర్పడి ప్లాస్టిక్‌తో పర్యావరణానికి కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. ఎంపీడీఓ జిలాన్‌బాషా, తహసీల్దార్ ఈశ్వరమ్మ, ఎంఈఓ శ్రీధర్, ఆఓఆర్డీ రఘురాంరావు, వైద్య, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

ఉరవకొండ: ఉరవకొండ మేజర్ పంచాయతీ పరిధిలో ప్లాస్టిక్ వాడకం పూర్తిగా నిషేధించినట్లు మేజర్ పంచాయతీ సర్పంచ్ మీనుగ లలితమ్మ తెలిపారు. శనివారం ప్లాస్టిక్ నిషేధంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ రవిప్రసాద్ మాట్లాడుతూ.. పర్యావరణం, పచ్చదనాన్ని కాపాడుకోవడానికి ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలన్నారు. మేజర్ పంచాయతీ పరిధిలో ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ కవర్లు, ఇతర వస్తువులు వినియోగించరాదన్నారు. కార్యక్రమంలో ఈఓ ఆర్డీ సతీష్, ఈఓ గౌస్‌సాహెబ్ పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వినియోగంతో అనర్థాలు

రాయదుర్గంటౌన్/కణేకల్లు/బొమ్మనహాళ్/గుమ్మఘట్ట: ప్లాస్టిక్ రహిత పట్టణ కోసం ప్రజలు సహకరించాలని



కణేకల్లులో మానవహారంగా ఏర్పడిన దృశ్యం

ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు కోరారు. స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం సింగల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధంపై రాయదుర్గంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద ర్యాలీని ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి, మున్సిపల్ సిబ్బంది, అధికారులు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. అలాగే కణేకల్లులో నిర్వహించిన ర్యాలీలో పంచాయతీ ఎగ్జిక్యూటీవ్ ఆఫీసర్ ప్రసాద్, సిబ్బంది, విద్యార్థులు, పాల్గొన్నారు. అదేవిధంగా బొమ్మనహాళ్ మండల వ్యాప్తంగా స్వచ్ఛాంధ్ర, స్వర్ణ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించారు. గ్రామాల్లో ప్రజలకు కాయగూరలు వాడకం కోసం క్యారీ బ్యాగ్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విజయభాస్కర్, డిప్యూటీ ఎంపీడీఓ దాస్, ఏపీఎం రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శులు పల్లవి, శివన్న తదితరులు పాల్గొన్నారు. అలాగే గుమ్మఘట్టలో నిర్వహించిన ర్యాలీలో ఎంపీడీఓ రామకృష్ణ, తహసీల్దార్ రజాక్‌వలీ, పంచాయతీ కార్యదర్శులు, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడి

కళ్యాణదుర్గం రూరల్: ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడి పొందవచ్చని ఎకాలజీ సెంటర్ ప్రతినిధులు పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని దొడగట్టలో రైతులతో సమావేశం నిర్వహించారు. భూమిలో ఘన జీవామృతం, జీవామృతం, పంటకు వేయడం వల్ల భూమిలో పోషకాలు పెరుగుతాయన్నారు. ప్రకృతి వ్యవసాయం చేయడం వల్ల జరిగే ప్రయోజనాలను రైతులకు తెలియజేశారు. కార్యక్రమంలో ఎకాలజీ సిబ్బంది రుద్రయ్య, వీరభద్ర, ఎంటీఎల్ భవాని, ఎస్‌టీఓ రమేష్, సునిత, రైతులు పాల్గొన్నారు.

బూదగవిలో పీ-4 సర్వే

ఉరవకొండ రూరల్: మండలంలోని బూదగవి, వెలిగొండ గ్రామాల్లో శనివారం ఎంపీడీఓ రవిప్రసాద్ ఆధ్వర్యంలో గ్రామ సభలు నిర్వహించారు. ఇందులో పీ-4 సర్వే కార్యక్రమంపై సమీక్షతో పాటు ప్రభుత్వ, ప్రయివేట్, ప్రజల భాగస్వామ్యంతో గుర్తించబడిన బంగారు కుటుంబాల మ్యాపింగ్ చేపట్టారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.